# <u>పత్రికా ప్రకటన</u>

తేది:07.03.2023

ద్రావిడ విశ్వవిద్యాలయం మహిళా సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వర్సిటీ శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులు ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వర్సిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ వేడుకలకు గౌరవ అతిథిగా పాల్గొన్న వర్సిటీ రెక్టార్ ఆచార్య టి.అనురాధ మాట్లాడుతూ... పూర్వం ఉన్న పరిస్థితుల కంటే ప్రస్తుత పరిస్థితులు కొంత వరకు మారినా.. నేటి సమాజంలోని వ్యక్తుల ఆలోచనా ధోరణులను మార్చలేకపోతున్నామని పేర్కొన్నారు. ఒక స్త్రీ ఉద్యోగ రీత్యా, చదువు రీత్యా బయటకు వచ్చినప్పుడు వారు ఎదుర్కొంటున్న హేయమైన సంఘటనల గురించి ప్రస్తావిస్తూనే.. చదువుతో పాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వ్యక్తులే దిగజారిన భావాలను కలిగి ఉండటం శోచనీయమన్నారు. ప్రస్తుతం సమాజంలో దిగజారుతున్న విలువల గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించి, తగిన పరిష్కారాలను సూచిస్తూ సమాజంలోని వ్యక్తుల ఆలోచనా ధోరణులు మార్చుకోవాల్సిన ఆవశ్యకత గురించి విపులంగా వివరించారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న వర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... మానవ మనుగడలో అత్యంత ప్రధాన పాత్రలు వహించే విద్య, చదువు, సంస్కారాలకు సంబంధించి మనం అధిపతులుగా లక్ష్మీదేవి, పార్వతీ అమ్మవారు, సరస్వతీ దేవి అమ్మవార్లు ఉన్నారన్నారు. మానవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువే అని.. త్యాగంలో, అనురాగంలో తరుగని పెన్నిధి మగువ అని, మానవ జాతి మనుగడ స్త్రీమూర్తి పైనే ఆధారపడి వుందన్నారు. మన సంస్కృతిలో స్త్రీ పురుషుల సమన్వయ జీవితాన్ని అర్ధనారీశ్వర తత్త్వంగా భావిస్తామన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీమూర్తి ఉన్నది అక్షర సత్యం అయితే, ఇది ఎందరో విజేతల జీవితంలో మనకు సాక్షాత్కారింపబడి నిరూపింపబడిందన్నారు. పురుషుడు ఎప్పుడూ స్త్రీమూర్తిపైనే ఆధారపడ్డవాడని, గృహ చట్టాలకు అధినేత అమ్మే అని, పురుషుని వివాహ జీవితంలో ప్రధాన పాత్ర వహించేది భార్యే అని.. పురుషుడి జీవితం స్త్రీ మూర్తి సహచర్యం లేకుండా సాగదని స్పష్టం చేశారు. ప్రస్తుత కాలంలో అన్ని రంగాల్లో కూడా స్త్రీలు పురుషులతో సమానంగా కాకుండా అధికంగా విద్య, ఉపాధి రంగాల్లో ఎదిగి సాటిలేని మేటితనంతో రాణిస్తున్నారన్నారు. స్త్రీ చదువుకుంటే కుటుంబం మొత్తం బాగుపడుతుందని భావించినటువంటి మహాత్మ గాంధీ గారి కన్న కలలు నేడు నిజమవడం మనకందరికీ ఎంతో సంతోషదాయమకన్నారు. మన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు బేటీ పడావో.. బేటీ బచావో అన్న ప్రత్యేక పథకాలను రచిస్తూ ముందుకు వెళ్తున్నారని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గారు అమ్మ ఒడి, విద్యా దీవెన, జగనన్న చేదోడు, ఆడవారి పేర్లపై ఇళ్ళ పట్టాలు, వైఎస్సార్ కళ్యాణ కానుక, దిశా వంటి చట్టాలతో స్త్రీ జాతిపట్ల గౌరవాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. దాంపత్య జీవితం, కుటుంబ జీవితం హక్కుల పోరాటం కాదని, అదొక సమన్వయ సూత్రం అని విద్యార్థులకు తెలియజేశారు.

ప్రత్యేక అతిథిగా పర్పుల్ ఆపిల్ ఇన్ఫో సిస్టమ్ అధినేత అమృత వళ్ళి ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ... స్టార్టప్‌గా తాను ప్రారంభించిన వ్యాపారం, తాను ఎదుర్కొన్న ఒడిదుడుకులను గురించి వివరించారు. మహిళలు తాము ఎంచుకున్న రంగంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కష్టపడి ఒక ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. వర్శిటీలో ఆసక్తి కలిగిన విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కి ఆమె ఆహ్వానించారు.

ప్రత్యేక అతిథిగా పాల్గొన్న అడ్వకేట్, మాజీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోక్సో కోర్టు, చిత్తూరు బి.లీలావతి మాట్లాడుతూ... వివిధ చట్టాలు, తాను పరిష్కరింపబడిన ఒకన్ని కేసులను గురించి వివరించారు. అదేవిధంగా దిశ యాక్ట్ గురించి, సిడబ్ల్యూడి మరియు ఎన్‌జీవోల గురించి తెలియజేశారు. వరకట్నం హత్యలు, గృహహింస కేసులు, ఈవ్–టీజింగ్ కేసులు, భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, చట్టం తీసుకునే చర్యలు, వాంగ్మూలాలు వాటి పరిధి, లెక్కలోకి రానన్ని ఎన్నో కేసుల గురించి విపులంగా వివరించారు. వివిద చట్టాలను గురించి వివరించడమే కాకుండా మహిళలను సెల్ఫ్ రెస్పెక్ట్, సెల్ఫ్ ప్రొటెక్ట్‌గా ఉండమని ఉత్తేజపరిచారు.

వర్శిటీ డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరు లోకనాథం, ఆచార్య జె.వి.సత్యవాణి, ఆచార్య యశోద, వర్శిటీ మహిళా విభాగం కోఆర్డినేటర్ డా.శోభారాణి, అడిషనల్ కోఆర్డినేటర్ డా.కళావతిలు విద్యార్థులకు ఎందరో మహిళల వీరగాథలు, చరిత్రలు చదవటం వలన వారు స్ఫూర్తి పొంది తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పేర్కొన్నారు. చరిత్రలోని ప్రముఖమైన వ్యక్తులందరి గురించి తెలుసుకుని విద్యార్థులు తమను తాము రాబోవు భవిష్యత్తుకు సన్నద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

అనంతరం అతిథులను వర్శిటీ తరపున ఘనంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ వేడుకల్లో రిజిస్ట్రార్ సతీమణి ఆకేపాటి మాధురి, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**– డా.ఎమ్.ఎస్.దుర్గాప్రవీణ్, పిఆర్ఓ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం**








DRAVIDIAN UNIVERSITY
Mrs. B. N. Kalavathi
Dravidian University


07-03-2023
Time:10.30 am
Chief Guests
Guests of Honour
Prof. T. Anuradha
Rector, Dravidian University
Dr. A.K. Venugopal Reddy
Registrar, Dravidian University





